



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM


## కరోనా వైరస్ జేఎన్.1 వేరియంట్ లక్షణాలివే!



- ★ జ్వరం, ఒళ్లు నొప్పులు
- ★ జలుబు.. ముక్కు కారడం
- ★ గొంతు నొప్పి
- ★ వాసన-రుచి శక్తిని కోల్పోవడం
- ★ తలనొప్పి
- ★ కొందరిలో కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ సమస్య
- ★ వాంతులు, విరేచనాలు
- ★ మరికొందరిలో శ్వాసకోశ సమస్యలు

పై లక్షణాలు పూర్తి స్థాయిలో కనిపించడానికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుంది. ఈ తరహా లక్షణాలు కనిపించినప్పుడు.. వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ల్యాబ్‌లకు వెళ్లి టెస్టులు చేయించుకోవాలి.








# సభలో హైవోల్టేజ్ వాదనలు

## తెచ్చిన అప్పులతో ఎక్కడా నష్టం జరగలేదు.. ఆస్తులు పెంచాం : జగదీశ్ రెడ్డి

### మంత్రి కోమటిరెడ్డి X జగదీశ్‌రెడ్డి.. విద్యుత్తు రంగంపై వాడివే'డీ'గా చర్చ

దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ తన స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమెట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. శాసన సభలో విద్యుత్ రంగంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యుత్ పరిస్థితిని ఆయన వివరించారు. 2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు 44,438 కోట్లు ఉంటే.. అప్పు 22,423 కోట్లు ఉండేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు 81,016 కోట్లు అవ్వగా.. ఆస్తుల విలువ 1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని.. ఆస్తులు పెంచామని వివరించారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంలో పిల్లలకు పరీక్షలు వస్తున్నాయంటే.. పెద్దలకే పెద్ద పరీక్ష ఉండేదని గుర్తు చేశారు. పరీక్షలు వస్తున్నాయంటే.. కిరసనాయిల్ దేవులాడుకురావడం.. క్యాండిల్స్ కొనుక్కొచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్లు కావాలంటే బోరుబావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా బోరుబావి దగ్గరికి పోయాక కరెంటు పోతే.. రెండు గంటలా? మూడు గంటలా? నాలుగు గంటలా? ఎన్ని గంటలు అక్కడే ఉండాలో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. బిందెడు నీళ్లు లేకుండా ఇంటికి పోతే ఎసరు పెట్టే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు ధర్నా చేసిన మొట్టమొదటి సందర్భం సమైక్య పాలనలోనే హైదరాబాద్‌లో జరిగిందని అన్నారు.

**మంత్రి కోమటిరెడ్డి X జగదీశ్‌రెడ్డి..**

తెలంగాణలో విద్యుత్ రంగంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. ముందుగా యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో 10 వేల కోట్లను జగదీశ్ రెడ్డి తిన్నారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధీటుగా స్పందించారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి కోరారు. ఆ విచారణలో దోషులు దొరికితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆధారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు. తప్పకుండా ఈ విషయం తేలాలని అన్నారు. ఇటువంటివి చాలా సందర్భాల్లో బయట మాట్లాడుతుంటే విన్నానని.. కానీ ఏ ఒక్కరోజు కూడా రియాక్ట్ కాలేదని చెప్పారు. ఇవన్నీ పనికిమాలిన మాటలు.. అర్థం లేని.. ఆధార రహితమైన మాటలు అని అన్నారు. ఇవన్నీ రికార్డుల్లోకి రావాలనే ఇన్ని రోజులు వెయిట్ చేశానని.. ఇవాళ రికార్డుల్లోకి వచ్చాయని అన్నారు. దీనిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆ విచారణతో పాటు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలన్నారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. అది మీరు చేయగలుగుతారా? ప్రజా కోర్టులో తేలుస్తామా అనేది చూడాలన్నారు.

**కేసీఆర్ కరెంట్ కొనుగోళ్లపై జుడీషియల్ విచారణ : సీఎం రేవంత్ రెడ్డి**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన కరెంట్ కొనుగోళ్లపై జుడీషియల్ విచారణకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూడు అంశాలపై పూర్తి స్థాయిలో జుడీషియల్ ఎంక్వైరికీ ప్రభుత్వం సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించారు. జగదీశ్ రెడ్డి సవాల్ ను స్వీకరిస్తున్నాం. విద్యుత్ శాఖలో స్కాంలపై విచారణ చేయిస్తామన్నారు రేవంత్. చత్తీస్ ఘడ్ తో ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టులపై జుడీషియల్ ఎంక్వైరీ చేయిస్తామన్నారు. ఆనాటి ప్రభుత్వం సభలో ఏనాడు వాస్తవాలు బయట పెట్టలేదన్నారు. చత్తీస్ ఘడ్ ఒప్పందం తప్పని చెప్పిన ప్రభుత్వ ఉద్యోగిని గత ప్రభుత్వం వేధించిందన్నారు రేవంత్. మారుమూల ప్రాంతానికి బదిలీ చేసి హోదాను తగ్గించిందని చెప్పారు. చత్తీస్ ఘడ్ ఒప్పందపై తాము ప్రశ్నిస్తే సభలో మార్షల్ తో బయటకు గెంటించారని విమర్శించారు రేవంత్. ఉద్యోగ శాఖను పూర్తిగా స్కానింగ్ చేసి పూర్తి వివరాలు బయటపెడ్తమన్నారు. కరెంట్ అనే సెంటిమెంట్ ను గత ప్రభుత్వం ఆర్థిక అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. మొత్తం వాస్తవాలను బయటకు తీయాల్సిన అవసరం ఉందన్నారు.

## విద్యుత్ రంగంలో తెలంగాణ అప్పులు రూ, 81 వేల 516 కోట్లు

తెలంగాణలో విద్యుత్ రంగం పరిస్థితి ఆందోళకరంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి కరెంటు నిరంతర సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలతో శ్వేతపత్రాన్ని శాసనసభలో గురువారం ఆయన ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా, ఉత్పత్తి గురించి అందరికీ తెలియాలనే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి, వ్యవసాయ రంగం పురోగతికి విద్యుత్ సరఫరానే వెన్నెముక అని చెప్పిన ఆయన.. రవాణా, సమాచార రంగాలు మనుగడ సాగించాలంటే విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమన్నారు. విద్యుత్తే రాష్ట్ర ప్రజల నాణ్యమైన జీవనశైలిని సూచిస్తుందని చెప్పారు. విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో), విద్యుత్తు సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో), ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కం)లకున్న రూ.81 వేల కోట్ల రుణాలు, రూ.50 వేల కోట్లకుపైగా నష్టాలు, గత తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. అనంతరం దీనిపై శాసన సభలో చర్చ ప్రారంభమైంది.



## బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్ అరెస్ట్..


### 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు..

బిగ్ బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిన్న రాత్రి గజ్వేల్ మండలం కొల్గూరులో అదుపులోకి జూబ్లీహిల్స్ పోలీసులు తీసుకున్నారు. ప్రశాంత్ తోపాటు అతడి సోదరుడు రాజును సైతం పోలీసులు అరెస్ట్ చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం ప్రైవేటు ఆస్తులు ధ్వంసం కేసులో దాదాపు ఆరు గంటల పాటు జూబ్లీహిల్స్ స్టేషన్ లో విచారించారు. ఈ కేసులో పల్లవి ప్రశాంత్ ను ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో మొత్తం ఐదుగురిని నిందితులుగా చేర్చగా. ఇప్పటికే A4, A5లను అరెస్ట్ చేశారు. ఇక నిన్న రాత్రి గజ్వేల్ మండలం కొల్గూరులో ప్రశాంత్ ను, అతడి తమ్ముడి రాజును అదుపులోకి తీసుకున్నారు. ప్రశాంత్ మీద మొత్తం 9 కేసులు నమోదు చేశారు. నిన్న రాత్రి జడ్జి ఇంట్లో పల్లవి ప్రశాంత్ తో పాటు ఆయన సోదరుడిని ప్రవేశపెట్టారు పోలీసులు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయవాది..పల్లవి ప్రశాంత్‌తోపాటు సోదరుడు రాజుకి కూడా 14 రోజుల రిమాండ్ విధించారు. అర్ధరాత్రి ప్రశాంత్, అతడి తమ్ముడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.





## 400 పాయింట్లకు పైగా పడిపోయిన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్లపై బేర్ పట్టు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలకు తోడు.. షేర్ల విలువలు బాగా పెరిగాయనే భావనతో మదుపర్లు లాభాలు స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు గురువారం నష్టాల బాట పట్టాయి. అటు మరోసారి కోవిడ్ కేసుల పెరుగుదల, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో నేటి ట్రేడింగ్‌ను సూచీలు నష్టాలతో ప్రారంభించాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 432 పాయింట్లు నష్టపోయి 70074 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు దిగజారి 21,009 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు క్షీణించి రూ.83.22గా కొనసాగుతోంది.



## కొవిడ్-19తో మూగబోయిన 15 ఏళ్ల బాలిక!

కొవిడ్ 19 సోకడం వల్ల 15 ఏళ్ల బాలికకు మాట పడిపోయిన ఉదంతం అమెరికాలో వెలుగు చూసింది. కొవిడ్‌కు కారణమైన సార్స్‌కోవ్ 2 వైరస్ నాడీ మండలాన్ని దెబ్బతీస్తుందనడానికి ఇది సంకేతమని మెసాచుసెట్స్ కన్ను, చెవి ఆస్పత్రి వైద్యులు చెప్పారు. 15 ఏళ్ల బాలిక కొవిడ్ 19 సోకిన 13 వారాలకు శ్వాస సమస్యతో ఆస్పత్రిలో చేరింది. పరీక్షలు చేశాక ఆమె స్వరపేటికలో రెండు స్వర తంత్రులూ నిస్తేజమై గొంతు సంబంధ పక్షవాతం వచ్చినట్లు కనుగొన్నారు. ఆమె గొంతుకు వైద్యులు శస్త్రచికిత్సతో రంధ్రం చేసి గొట్టం పెట్టి ఊపిరి ఆడేట్లు చేశారు. ఇలా గొంతులో గొట్టం ద్వారా శ్వాస తీసుకోవలసిన పరిస్థితి 13 నెలలపాటు కొనసాగింది.



## 13 ఏళ్ల బాలికపై 10 రోజులుగా అత్యాచారం

13 ఏళ్ల మైనర్ బాలికను బలవంతంగా పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తి.. ఆమెపై పది రోజులుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగింది. మైనర్ బాలికను ఓ వ్యక్తి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయిన మరుక్షణం బాలికను ఓ గదిలో బంధించాడు. పది రోజులుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి అరాచకాన్ని తట్టుకోలేక బాలిక ఆ విషయాన్ని తల్లికి చెప్పింది. దాంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## రేపు భారత్ బంద్ కు పిలుపునిచ్చిన మావోయిస్టులు..

మావోయిస్టులు రేపు భారత్ బంద్ కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు హైఅలెర్ట్ ప్రకటించారు. దీంతో పోలీసులు తెలంగాణ- ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. దండ కారణ్యాన్ని భద్రత బలగాలతో జల్లెడ పడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆంధ్ర ప్రదేశ్ లో మావోయిస్టులు విధ్వసం సృష్టించారు. అల్లూరి జిల్లా చింతూరు ఏజెన్సీలో వీరాపురం దగ్గర వాహనాలపై మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు. కార్లకు నిప్పు పెట్టారు. రేపు తాము ఇచ్చిన భారత్ బంద్ పిలుపుని విజయవంతం చేయాలంటూ కరపత్రాలను మావోయిస్టులు వదిలి వెళ్లారు. అయితే మావోయిస్టుల డిమాండ్ల పై ఇంకా ఎలాంటి సమాచారం రాలేదు.. అయితే, నిన్న ( బుధవారం ) పోలీసులు- మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పులలో 8 మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. దీనికి నిరసనగా రేపు భారత్ బంద్ కు మావోయిస్టులు పిలుపు నిచినట్లు టాక్ వినిపిస్తుంది. ఛత్తీస్ ఘడ్ లో మావోయిస్టులకు- పోలీసులకు మధ్య భీకరమైన కాల్పులు జరిగాయి. సుక్మా జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలోని దండకారణ్యంలో మావోయిస్ట్ బేస్ క్యాంపులను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో మావోయిస్టుల సామాగ్రిని, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాలు ఎనిమిది మంది మావోయిస్టులను చంపేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## ఉచిత ప్రయాణానికి ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాలుగైదు నెలల్లో దాదాపు 2,050 కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. అందులో 1,050 డీజిల్, 1000 ఎలక్ట్రిక్ బస్సులు ఉంటాయన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం పథకానికి భారీ స్పందన వస్తోందన్నారు. ఆ వివరాలను బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉచిత ప్రయాణానికి అర్హులైనవారు తమ ప్రయాణ సమయంలో ఫొటో స్పష్టంగా కనిపించే ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లలో గుర్తింపు కార్డుల సాఫ్ట్ కాపీలు చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతి ఉండదని ఆయన స్పష్టంచేశారు. బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణంతో పాటు వెనుక లాడర్ పైకెక్కి ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించడం సరికాదన్నారు. పథకం 9వ తేదీ నుంచి అమల్లోకి రాగా 11 రోజుల్లో 3 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు.





## పార్లమెంట్ సెక్యూరిటీలో కీలక మార్పు

గత వారం పార్లమెంట్‌లో జరిగిన అలజడి తీవ్ర దుమారాన్ని రేపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ సెక్యూరిటీని మార్చాలని ఆదేశించింది. పార్లమెంట్ రక్షణ బాధ్యతను తాజాగా సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ బోర్డు (CISF') బృందాలకు అప్పగించింది.

## నేడు రాజ్యసభ ముందుకు కీలకమైన మూడు బిల్లులు



పార్లమెంట్ లో శీతాకాల సమావేశాలు హాట్ హాట్ గా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భారత న్యాయ సంహిత, భారత నాగరిక సురక్ష సంహిత, భారత సాక్ష్య అధినీయం బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అయితే, ఈ మూడు బిల్లులు ఇవాళ రాజ్యసభ ముందు ప్రవేశ పెట్టనున్నారు. అయితే, ఈ సభలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బలం లేదు.. దీంతో మెజారిటీ సభ్యుల నుంచి ఆమోదం పొందితేనే రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తారు. ఇక, ఆ తరువాత ఈ మూడు బిల్లులు చట్టంగా మారనున్నాయి. వీటిని ప్రస్తుతం ఉన్న ఐసీసీ, సీఆర్పీసీ చట్టాలలో ప్రత్యేక యాక్ట్ గా పొందు పర్చారు. ఈ చట్టాలు నేరస్తులను శిక్షించడానికి కాదని.. బాధితులకు న్యాయం జరగడానికని కేంద్రం తెలిపింది. దేశంలో ఏదైనా అసాంఘీక ఘటనలు తలెత్తితే వేగంగా న్యాయం చేసేందుకు ఈ చట్టాలు ఉపయోగపడుతాయని తెలిపారు. డిజిటల్, ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న ఎవిడెన్స్ లను సైతం సాక్ష్యంగా పరిగణలోకి తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## హైదరాబాద్, ప్రొద్దుటూరులో ఐటీ సోదాలు

ప్రొద్దుటూరు నేరవార్తలు: హైదరాబాద్‌తో పాటు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కేసీ పుల్లయ్య అనే వ్యక్తి నివాసం, కార్యాలయాల్లో సోదాలు చేస్తున్నారు. కేసీ పుల్లయ్య కుమారుడు అనిల్ తెలుగు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. ప్రొద్దుటూరులోని కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు కూడా కేసీ సంస్థ చేపడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కేసీ పుల్లయ్య సంస్థల్లోనూ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఎక్కడెక్కడ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.



## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

024 సార్వత్రిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో.. పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తుంది. ఎన్నికల సమాయత్తంపై ఈరోజు సమావేశం నిర్వహించనుంది కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో.. నేడు ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, కీలక నాయకులు హాజరుకానున్నారు. పార్లమెంట్ ఎన్నికలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరగనుంది.




## విమానం ఇంజన్లో మంటల అలర్ట్.. చివరికి

ఎయిర్ ఇండియా విమానం ఇంజన్లో మంటలు రాజుకున్నట్టు అలర్ట్ రావడంతో పైలెట్ అప్రమత్తమయ్యారు. వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించి పైలట్లు విమానాన్ని సేఫ్ ల్యాండ్ చేశారు. కానీ తనిఖీల్లో మంటలు ఏమి తలెత్తలేదని వెల్లడైంది. డిసెంబర్ 19న ఢిల్లీ-ముంబై వస్తున్న విమానంలో ఈఘటన జరిగింది. ముంబైలో ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగడానికి ముందు మంటలు రేగినట్టు పైలట్‌కు అలర్ట్ అందింది. ఘటనపై డిజీసిఏ దర్యాప్తు ప్రారంభించింది.





## అమెరికాలో విజయవాడ వైద్య విద్యార్థిని మృతి

ఉన్నత వైద్య విద్య చదవటానికి అమెరికా వెళ్లిన ఓ యువతి కారులో ప్రయాణిస్తూ దుర్మరణం పాలయ్యారు. విజయవాడలోని ప్రసాదంపాడుకు చెందిన షేక్ జహీరా నాజ్(22) నగరంలోని ఓ కళాశాలలో ఫిజియోథెరపీ డిగ్రీ చేశారు. ఈ ఏడాది ఆగస్టులో ఎంఎస్ చేయడానికి అమెరికాలోని షికాగోకు వెళ్లారు. బుధవారం కారులో ప్రయాణిస్తుండగా గ్యాస్ లీకవడంతో డ్రైవర్‌తో పాటు జహీరా నాజ్ స్పృహ తప్పారు. ఆసుపత్రికి తీసుకెళ్లగా.. ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## అంబులెన్స్‌లో 364 కిలోల డ్రగ్స్ తరలింపు

అంబులెన్స్‌లో అక్రమంగా తరలిస్తున్న డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగింది. అంబులెన్స్‌లో 364 కిలోల సైకోట్రోపిక్ డ్రగ్స్ తరలిస్తున్నారు. ఆమనక పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు అంబులెన్స్‌ను అడ్డగించి తనిఖీ చేశారు. అంబులెన్స్ నుంచి భారీ మొత్తంలో డ్రగ్స్ బయటపడింది. వీటి విలువ మార్కెట్‌లో రూ.36 లక్షలు ఉంటుందని, సూరజ్ ఖుటే (22) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# డంకీ రివ్యూ




చేసింది తక్కువ సినిమాలైనా ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకున్నాడు దర్శకుడు రాజ్ కుమార్ హిరానీ. ఆలోచింపజేసే సినిమాలు చేస్తాడని పేరున్న ఆయన షారుఖాన్ తో డంకీ అనే సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దానికి తోడు షారుక్ ఖాన్ గత సినిమాలు పఠాన్, జవాన్ బ్లాక్ బస్టర్ హిట్లు కావడంతో ఈ సినిమా మీద కూడా ప్రేక్షకులలో భారీగా ఆసక్తి ఏర్పడింది. దానికి తోడు దక్షిణాదిన రిలీజ్ అవుతున్న సలార్ సినిమాకి ఒకరోజు ముందు రిలీజ్ అవడంతో ప్రేక్షకులలో ఈ సినిమా ఎలా ఉంటుందని ఆసక్తి ఏర్పడింది. స్వయంగా రాజ్ కుమార్ ఇరానీ షారుక్ ఖాన్ భార్య గౌరీ ఖాన్ నిర్మాతలుగా వ్యవహరించిన ఈ సినిమా ఈ గురువారం నాడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉంది అనేది రివ్యూలో చూద్దాం.

డంకీ కథ ఏమిటంటే?

ఒకానొక సమయంలో తుపాకీ కాల్పులలో గాయపడిన సైనికుడు హృదయ పాల్ సింగ్ ధిల్లాన్ అలియాస్ హార్డీ( షారుఖ్ ఖాన్) తనను కాపాడిన వ్యక్తిని వెదుకుతూ అతని ఇంటికి వెళతాడు. అయితే అతను రోడ్డు ప్రమాదంలో మరణించాడని అతని సోదరి మను రంధ్వా (తాప్సీ పన్ను) ద్వారా తెలుసుకుంటాడు. తనకోసం చాలా సమయం వెచ్చించిన వ్యక్తి కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తెలుసుకొని వారి ఇబ్బందులు తీర్చే ప్రయత్నం చేస్తాడు. అందులో భాగంగా ఇంగ్లాండ్ వెళ్ళడానికి యత్నిస్తున్న మనుకి రెజ్లింగ్లో ట్రైనింగ్ అవ్వాలని నిర్ణయించుకుంటాడు. ఆ తర్వాత హార్డీ మనుతో ప్రేమలో పడడమే కాదు ఆమెతోపాటు ఇంగ్లాండ్ కూడా వెళ్లాలని ఫిక్స్ అవుతాడు. లీగల్ గా వెళ్లేందుకు అన్ని ప్రయత్నాలు చేసి అవి సఫలం కాకపోవడంతో ఇల్లీగల్ గా డంకీ అంటే గాడిదల రూట్ లో వెళ్లాలని నిర్ణయం తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో మరికొంత మందితో బయలుదేరి ఇంగ్లాండ్ అనేక వ్యయ ప్రయాసలకోర్చి తీసుకు వెళతాడు. అయితే అంత కష్టపడి ఇంగ్లాండ్ తీసుకు వెళ్లిన తర్వాత హార్డీ ఇండియా వచ్చేయాలని, అక్కడే ఉండాలని మను నిర్ణయం తీసుకుంటారు. అలా పాతికేళ్లు ఒకరికి ఒకరు కాంటాక్ట్ కూడా లేకుండా గడిచిపోయిన నేపద్యంలో ఇంగ్లాండ్ సిటిజెన్షిప్ వచ్చిన తర్వాత మను భారత్ రావాలనుకుంటుంది. కానీ అందుకు ఇండియన్ ఎంబసీ ఒప్పుకోదు. మరి ఆమె ఇండియా తిరిగి వచ్చేందుకు ఏం చేసింది? ఆమెను ఇండియా తీసుకొచ్చేందుకు హార్డీ ప్రయత్నాలు చేశాడా? చివరికి ఆమె ఇండియా తిరిగి వచ్చిందా లేదా? ఇంగ్లండ్ సిటిజన్షిప్ వచ్చిన ఏడాదికే ఆమె ఇండియా తిరిగి రావాలని ఎందుకు అనుకుంది? అనే వివరాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ: సాధారణంగా రాజ్ కుమార్ హిరానీ సినిమాలు అంటేనే ఒక సోషల్ మెసేజ్ తో కూడిన సినిమాలు అని అందరూ భావిస్తూ ఉంటారు. ఆయన మొదటి సినిమా త్రీ ఇడియట్స్ కానీ, తర్వాత చేసిన పీకే కానీ బ్లాక్ బస్టర్ హిట్లవడమే కాదు కొన్ని ఎవరూ ప్రశ్నించని విషయాలను కూడా సూటిగా ప్రశ్నించాయి. ఆ తర్వాత సంజయ్ దత్ బయోపిక్ గా చేసిన సంజు సినిమా కూడా బాగానే ఆడింది. ఈ నేపథ్యంలో రాజ్ కుమార్ హిరానీ డైరెక్ట్ చేసిన డంకీ సినిమా ఎలా ఉంటుందని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. అయితే డంకీ సినిమా మరో సరికొత్త సమస్యతో ప్రేక్షకులను పలకరించింది. మనం రోజు వార్తల్లో చూస్తూనే ఉంటాం ఫలానా దేశపు బోర్డర్లో అక్రమ వలసదారులు కాల్చివేయబడ్డారు లేదా పట్టుబడి జైలుకు వెళ్లారు అని. ఇలా అక్రమ వలసదారులు అనే కాన్సెప్ట్ తీసుకుని వారు ఎమోషన్స్ తో ప్రేక్షకులను టచ్ చేసే ప్రయత్నం చేశాడు రాజ్ కుమార్ హిరానీ. పుట్టిన దేశంలో బతుకు దుర్భరమై ఇక ఇక్కడ బతకలేము మెరుగైన బతుకు కావాలంటే చిన్న పనికి కూడా గట్టిగా డబ్బు సంపాదించగలిగే దేశానికి వెళ్లాలని అనేక ఆఫ్రికా దేశాల వారితో పాటు మన భారతీయుల సైతం భావిస్తూ ఉంటారు. అలాంటి వారి కష్టాలు ప్రతిబింబించేలా ఈ సినిమా డైరెక్ట్ చేశాడు రాజ్ కుమార్ హిరానీ.. మొదటి భాగమంతా పాత్రల పరిచయానికే తీసుకున్న దర్శకుడు ఇంటర్వెల్ కి ముందు డంకీ అసలు కథ మొదలవుతుందని క్లారిటీ ఇచ్చాడు. డంకీ అంటే గాడిదల రూట్. అసలు ఎలాంటి లీగల్ పేపర్లు లేకుండా హీరో హీరోయిన్ సహా కొందరు వ్యక్తులు భారతదేశంలోని పంజాబ్ నుంచి లండన్ వెళ్లే ప్రయాణమే ఈ డంకీ సినిమా.. మొదటి భాగం అంతా ఏదో సాగతీస్తున్నట్టు, ఇంకా అసలు కథ మొదలవడం లేదు ఎంటి అని అనుమానం కలిగించేలా ఉంటుంది.. ఎప్పుడైతే ఇంటర్వెల్ తర్వాత సెకండ్ హాఫ్ మొదలవుతుందో అప్పుడు సినిమా మీద ఒక్కసారిగా ఆసక్తి పెరుగుతుంది. పంజాబ్ లో బయలుదేరిన బృందం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, టర్కీ, ఇరాన్ మీదుగా లండన్ చేరుకోవడం, అక్కడికి వెళ్ళాక అడుక్కోవలసిన పరిస్థితులు ఏర్పడడం అది చూసి ఈ హీరోకి విరక్తి కలగడం లాంటి సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఇంగ్లండ్ దేశంలో బతకడానికి సొంత దేశంలో తమకు రక్షణ లేదని చెప్పలేను అని హీరో పలికిన డైలాగ్ తో రాజ్ కుమార్ హిరానీ థియేటర్ అంతా చప్పట్లు కొట్టించుకునేలా చేశాడు. అయితే అక్కడ ఉండలేక, ఇండియా వచ్చేందుకు పరిస్థితులు అనుకూలించక అక్కడే ఉండిపోయిన వారి కష్టాలు కళ్ళకు కట్టినట్లు చూపించడంలో ఈ సినిమా సఫలం అయింది. అయితే ఫస్ట్ ఆఫ్ అంతా కామెడీ యాంగిల్ లో, లైటర్ వేలో సాగిన సినిమా సెకండ్ హాఫ్ మొత్తం ఎమోషనల్ గా సాగింది.. గత రాజ్ కుమార్ హి nరానీ సినిమాలతో పోలిస్తే ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవడం కష్టమే కానీ. ఇది చాలా మంది అక్రమంగా లేదా సక్రమంగా విదేశాలకు వెళ్లి కష్టపడుతున్న వారికి, వారి కుటుంబాల వారికి కనెక్ట్ అయ్యే అవకాశం ఉంది.

నటీనటుల విషయానికి వస్తే కనుక ఈ సినిమాలో షారుక్ ఖాన్ ఎప్పటిలాగే తన గ్రాస్ తో చుట్టూ ఉన్న అందరిని డామినేట్ చేశాడు. యుద్ధంలో గాయమై వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న జవాన్ గా తొలుత ప్రేక్షకులకు పరిచయమై ఆ తరువాత మను అనే అమ్మాయిని ప్రేమించే వ్యక్తిగా తన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేశాడు. మిగతా పాత్రధారులు ఉన్నా సరే వన్ మ్యాన్ షో లాగా సినిమా మొత్తాన్ని భుజస్కందాల మీద వేసుకుని నడిపించాడు. మను అనే పాత్రలో తాప్సీ పన్ను ఒదిగిపోయి నటించింది. ఉన్నంతలో తన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేసింది. అయితే తాప్సి స్థానంలో బాలీవుడ్ లో వేరే ఎవరైనా స్టార్ హీరోయిన్ ని తీసుకుని ఉంటే ఆ ఇంపాక్ట్ వేరేలా ఉండేదేమో.. ఇంగ్లీష్ టీచర్ గా గీతు అనే పాత్రలో నటించిన బోమన్ ఇరానీ కూడా పూర్తి స్థాయిలో తన పాత్ర న్యాయం చేశాడు.. ఇక మిగతా పాత్రధారులందరూ తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు. టెక్నికల్ టీం విషయానికి వస్తే ఈ సినిమా దర్శకుడిగా రాజ్ కుమార్ హిరానీ తన ప్రతిభను మరోసారి చాటుకునే ప్రయత్నం చేశాడు. కానీ ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయ్యే విషయం అనుమానమే. అయితే క్రాఫ్ట్ పరంగా ఎప్పటిలాగే తనదైన మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశాడు. కాకపోతే అది పూర్తిస్థాయిలో సఫలం కాలేదనిపిస్తుంది.. ఎడిటింగ్ కూడా ఆయనే చేయడంతో కాస్త క్రిస్పీగానే కట్ చేసుకున్నట్లుగా అనిపించింది. ఇక సంగీతం, నేపథ్య సంగీతం సినిమాకి తగినట్లుగా ఉన్నాయి. సినిమాటోగ్రఫీ చాలా బాగుంది, పంజాబ్ అందాలతో పాటు ఇంగ్లాండ్లోని దుర్భర పరిస్థితులను క్యాచ్ చేసిన విధానం బాగుంది. డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్టు ఉన్నాయి.



## ఏంజెల్‌గా మెరిసిన ప్రియా వారియర్..

క్రేజీ బ్యూటీ ప్రియా వారియర్ దేవ కన్య లుక్ లోకి మారిపోయింది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఏంజెల్‌గా తయారైన ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. కేవలం ఒక్క వీడియో క్లిప్‌తో రాత్రికి రాత్రే పాపులర్ అయ్యింది ప్రియా ప్రకాష్ వారియర్. కన్ను కొట్టి కుర్రకారును కట్టిపడేసింది. క్రేజీ బ్యూటీ ప్రియా వారియర్ దేవ కన్య లుక్ లోకి మారిపోయింది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఏంజెల్‌గా తయారైన ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.కేవలం ఒక్క వీడియో క్లిప్‌తో రాత్రికి రాత్రే పాపులర్ అయ్యింది ప్రియా ప్రకాష్ వారియర్. కన్ను కొట్టి కుర్రకారును కట్టిపడేసింది.2019 లో ప్రియా ప్రకాష్ వారియర్ 'ఒరు అదార్ లవ్' లోనటించింది. ఈ ప్రియాకుమంచి పాపులారిటీని తెచ్చిపెట్టింది.కన్నడ చిత్రం 'విష్ణుప్రియ'లో ప్రియా ప్రకాష్ వారియర్ హీరోయిన్ గా నటించింది. నిర్మాత కె మంజు తనయుడు శ్రేయాస్ ఈ లో హీరోగా నటిస్తున్నాడు. ప్రియా ప్రకాష్ వారియర్ ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ కొత్త ఫోటోలు షేర్ చేసింది.



## చింతపల్లిలో జగన్ పర్యటన.. సీపీఎం నేతల గృహనిర్బంధం

అల్లూరి జిల్లాలో ముఖ్యమంత్రి జగన్ గురువారం పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. చింతపల్లిలో సీపీఎం నాయకులను గృహనిర్బంధం చేశారు. ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్‌పై సీఎం ప్రకటన చేయాలని, జీవో నంబర్ 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏజెన్సీ వ్యాప్తంగా బస్ సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. పర్యటనలో భాగంగా చింతపల్లిలో 8వ తరగతి విద్యార్థులకు సీఎం జగన్ ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.



## బయటపడ్డ హమాస్ అతిపెద్ద కమాండ్ సెంటర్..!

హమాస్‌ను సమూలంగా నాశనం చేయడమే లక్ష్యంగా గాజాలో భీకర భూతల దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ దళాలు.. ఆ ముఠా నెట్‌వర్క్‌ను ఛేదిస్తున్నాయి. తాజాగా గాజా సిటీలో హమాస్ అతిపెద్ద కమాండ్ సెంటర్ బయటపడింది. దీని నుంచే హమాస్ తమ భూగర్భ సొరంగ నెట్‌వర్క్ మొత్తాన్ని నిర్వహిస్తున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. అయితే, ఈ కమాండ్ సెంటర్ ఎక్కడ గుర్తించిందో మాత్రం ఇజ్రాయెల్ వెల్లడించలేదు.

మరో ఒప్పందానికి హమాస్ తిరస్కరణ..

ఇదిలా ఉండగా, బందీల విడుదల కోసం మరో ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించగా.. హమాస్ దాన్ని తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. హమాస్ చెరలో ఉన్న మరో 40 మంది విడుదల కోసం 7 రోజుల ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించినట్లు సమాచారం.




## జగన్ బర్త్ డే రోజున 'యాత్ర 2' కొత్త పోస్టర్ రిలీజ్

మహి వి రాఘవ్ దర్శకత్వంలో త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'యాత్ర 2'. ఇందులో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాత్రలో మలయాళం సూపర్ స్టార్ మమ్ముట్టి, వై.ఎస్.జగన్ పాత్రలో కోలీవుడ్ స్టార్ జీవా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సినిమాలో ప్రముఖ పాత్రల లుక్స్‌కి సంబంధించిన పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేస్తూ వచ్చిన మేకర్స్ తాజాగా వై.ఎస్.జగన్ పాత్రను చేస్తున్న కోలీవుడ్ స్టార్ జీవా లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా 'యాత్ర 2' నుంచి స్పెషల్ పోస్టర్ విడుదల చేయటం విశేషం.వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఆధారంగా 'యాత్ర' చిత్రాన్ని తెరకెక్కించారు. అత్యంత ప్రజాదరణను పొందిన ఈ చిత్రంకు అలాగే ఇప్పుడు 'యాత్ర 2' ని కూడా అదే తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు, 2024 ఫిబ్రవరి 8న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది.